సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



ఇష్టానుసారంగా..

పచ్చని పల్లెల్లో నాటుసారా ఏరులై పారుతోంది. సారాకు బానిసై జనం అటు జేబులను ఇటు ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు.

వివరాలు 8లో ▸



ఈడ్చుకుంటూ తీసుకెళ్లి..

భర్తను భార్య దారుణంగా హత్య చేసిన ఘటన మునిపల్లి మండలంలో సోమవారం చోటుచేసుకుంది.

వివరాలు 8లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక కేజీబీవీలో ఖాళీగా ఉన్న ఫిజికల్ సైన్స్ అతిథి ఉపాధ్యాయ పోస్టులకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి రుబీనా పర్వీన్ సోమవారం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో కేజీబీవీలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

సీఎంకు ఘనస్వాగతం



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మధు

పటాన్‌చెరు: గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలం బండతిమ్మాపూర్ లో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ పరిశ్రమకు చెందిన అవిన్యా బెవరేజెస్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం విచ్చేశారు. హెలిప్యాడ్ వద్ద సీఎంకు నీలం మధుతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మల, డీసీసీ ప్రెసిడెంట్ నర్సారెడ్డి, మెదక్ డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ ఇన్‌చార్జి రాజీ రెడ్డి, దుబ్బాక ఇన్‌ఛార్జి శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఇన్‌చార్జి హరికృష్ణ, మెదక్ గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై కళా ప్రదర్శనలు



ప్రచారం చేస్తున్న కళాకారులు

నారాయణఖేడ్, న్యాల్‌కల్(జహీరాబాద్) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ప్రజాపాలన- విజయోత్సవాలపై మండల కేంద్రమైన మనూరు, పుల్‌కుర్తి, మాయికోడ్ గ్రామాల్లో సోమవారం కళాబృందం సభ్యులు ప్రదర్శన ఇచ్చారు. న్యాల్‌కల్ మండలం హద్నూర్, న్యాల్‌కల్, గంగ్వార్ తదితర ప్రాంతాల్లోను ప్రదర్శన నిర్వహించారు. రైతు భరోసా, రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత కరెంటు సరఫరా, మహిళలకు ఉచిత బస్సు , స్కిల్, స్పోర్ట్స్ వర్సిటీలు, మహిళలకు వడ్డీలేని రుణాల అమలుపై వివరించారు. యా కార్యక్రమాల్లో సభ్యులు పాల్గొన్నారు.

సన్నాల కేంద్రాలు పెంచండి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

సంగారెడ్డి టౌన్: సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా కార్యాలయంలో రైతులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మోసాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ముందుగా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల తనిఖీ



సీసీఐ కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి సీసీఐ కేంద్రాలను తనిఖీ చేశారు. సోమవారం మండలంలోని కంకోల్, మేళసంగ్యం సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్ల తీరును పరిశీలించారు. కార్యక్రమంలో సీసీఐ ఇన్‌చార్జి వరుణ్, రాయికోడ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి రవికుమార్, ఏడీఏ సత్యనారాయణ, ఏఈఓ నిఖిత, రాయికోడ్ మార్కెట్ డైరెక్టర్ మహేశ్ పాల్గొన్నారు.

వడ్డీలేని రుణం.. ఆర్థికాభివృద్ధికి దోహదం

జహీరాబాద్ టౌన్: పావలా వడ్డీ రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా అధికారులు బలవంత్‌రెడ్డి, అనిత కోరారు. పట్టణంలోని శాంతినగర్‌లో సోమవారం పద్మావతి స్లం సమైక్య విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడారు. పావుల వడ్డీ రుణాలను పెట్టుబడిగా పెట్టి సంఘం సభ్యులు సమష్టిగా వ్యాపారులు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పొదుపును అలవాటు చేసుకోవాలన్నారు. బిజినెస్ చేస్తూ వ్యాపారవేత్తలుగా తయారు కావాలన్నారు. పిల్లలను బాగా చదవించాలన్నారు.

స్థానిక సమాయత్తానికే..

బీసీల రిజర్వేషన్ల అభిప్రాయ సేకరణ

- బీసీ డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో కులసంఘాలు, స్వచ్ఛంద సంస్థల నేతలు వినతి

సంగారెడ్డి జోన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల కేటాయింపు కోసం అభిప్రాయ సేకరణ చేపట్టారని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు వెల్లడించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి బీసీ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఇతర కుల సంఘాల నాయకుల ఫిర్యాదులను వినతులను బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ స్వీకరించారు. వివిధ కుల సంఘాల నాయకులు 24 వినతులను అందజేశారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్ రావు మాట్లాడారు. స్థానిక సంస్థలు, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్‌లలో బీసీలకు ఎంతమేర రిజర్వేషన్లు కల్పించాలనే అంశంపై అభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. జనాభా ప్రాతిపదికన క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం జరిపించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా ఎంత మంది బీసీలు ఉన్నారో తెలుసుకుంటామన్నారు. వివిధ సంఘాల నేతలు అందించిన అభిప్రాయాలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో మెంబర్ సెక్రటరీ బి.సైదులు (ఐఎఫ్‌ఎస్), అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, బీసీ సంక్షేమ శాఖ డీడీ, ఆర్ రమేశ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి బీసీ సంక్షేమ అధికారి జగదీశ్, సిద్దిపేట జిల్లా బీసీ సంక్షేమ అధికారి షేక్ అహ్మద్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి అఖిలేశ్‌రెడ్డి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి , డీఎస్పీ సత్తియ్యా గౌడ్, వివిధ కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోస్టర్ సిస్టం అమలు చేయండి

చట్టసభలు అయిన అసెంబ్లీ, మండలి, పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి. రాజకీయంగా అవకాశాలు కల్పించాలి. రిజర్వేషన్లు రోస్టర్ సిస్టం సక్రమంగా అమలు చేయాలి. అమలు చేయని అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

–బీరయ్య యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం

రిజర్వేషన్ల సంఖ్య పెంచాలి

జిల్లాలో ఉన్న వీర శైవ లింగాయత్, లింగ బలిజల జనాభా దామాషా సంఖ్య ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి. స్థానిక సంస్థల ఎన్నికలలో గతంలో కంటే రిజర్వేషన్ల సంఖ్య పెంచాలి. జిల్లాలో రెండు లక్షల 50 వేల వరకు లింగాయత్ జనాభా ఉంది. రాజకీయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలి.

– పృథ్వీరాజ్, జిల్లా అధ్యక్షుడు, వీరశైవ లింగాయత్ లింగ బలిజ



న్యాయం చేయాల్సిందే

బీసీ కులగణన చేసి, గౌడ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేసి, రాజకీయ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. సుమారు లక్షకు పైగా ఓటర్లు కలిగి ఉన్నారు. వీరికి రాజకీయంగా రిజర్వేషన్లలో ప్రజాప్రతినిధులు కావడానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది.

–రమేశ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, కల్లు గీతా కార్మిక సంఘం

అభివృద్ధి కమిటీ వేస్తే..

బీసీలు రాజకీయంగా ఎదిగేందుకు స్థానిక సంస్థల ఎన్నికలలో రాజకీయంగా అవకాశాలు కల్పించాలి. కులాల సంఖ్య ఆధారంగా రాజకీయంగా అవకాశం కల్పిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుంది. ప్రతి జిల్లాకు అభివృద్ధి కమిటీని నియమించి, ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు బడ్జెట్‌ను కేటాయించాలి.

–కూన వేణుగోపాలకృష్ణ, యువజన సంఘాల రాష్ట్ర కార్యదర్శి, గంగపుత్రుల సంఘం సలహాదారుడు

ట్రాన్స్‌జెండర్స్ కోసం మైత్రి క్లినిక్

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రారంభించిన కలెక్టర్ క్రాంతి



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి: ట్రాన్స్‌జెండర్‌ల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ల ఏర్పాటు హర్షించదగ్గ విషయమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజాపాలన ప్రజావిజయోత్సవాలలో భాగంగా సోమవారం ఆరోగ్య దినోత్సవం కార్యక్రమం ద్వారా సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మైత్రిట్రాన్స్ క్లినిక్ (ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్)ను ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్స్‌కు వైద్యసేవలు ఎప్పటికీ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతీగురువారం ఓపీ సేవలు వారికి అందుబాటులో ఉంటాయన్నారు. మెడికల్ ఆఫీసర్, కౌన్సిలర్‌లను ఏర్పాటు చేశామన్నారు. వైద్య విభాగంలో నర్సింగ్ సేవలు చాలా ముఖ్యమైనన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్య అధికారి గాయత్రి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుధామాధురి, జిల్లా సంక్షేమ అధికారి వసంతకుమారి, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, ట్రాన్స్‌జెండర్ లవ్లీ టీం, ఇతర సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు విని.. పరిష్కరించాలని..

సంగారెడ్డి జోన్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. ఈ మేరకు 43 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్‌ఓ పద్మజారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతుల్లో టెన్షన్

- రెండు నెలలుగా బిల్లులు పెండింగ్
- గతనెల 9న రూ.50.65 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన
- 20 రోజులైనా జమ కాని సొమ్ము

పాడి రైతుల్లో టెన్షన్ పట్టుకుంది. రెండు నెలల బకాయిలకు గాను ఒక నెల చెల్లింపునకు ప్రభుత్వం ముందుకొచ్చింది. వెంటనే నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. కొద్ది రోజులు గడుస్తున్నా గానీ చేతికి చిల్లిగవ్వ కూడా అందలేదని రైతులు వాపోతున్నారు.

– వట్‌పల్లి(అందోల్):

విజయ డెయిరీ పాడి ఉత్పత్తిదారులకు యజమాన్యం రెండు నెలలగా బిల్లులు బకాయి పడింది. ప్రతీ 15 రోజులకొకసారి చెల్లింపులు చేసేది. ఇటీవల నిధుల సమస్య తలెత్తింది. దీంతో బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. ఇది పడి పోషణకు భారంగా మారడంతోపాటు చేతిలో డబ్బుల్లేక పోషకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారంటూ డెయిరీ అధికారులను నిలదీస్తున్నారు. ఈ విషయాన్ని సంస్థ ఎండీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించింది. వెంటనే రూ.50.65 కోట్లను విడుదల చేస్తున్నట్లు నవంబర్9న ప్రకటించింది. కానీ 20 రోజులైనా రైతుల అకౌంట్లలో సొమ్ము జమకాలేదు. అధికారులను ప్రశ్నిస్తే ఈరోజు, రేపు వస్తాయంటూ తిప్పుతున్నారే గానీ చెల్లింపులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బిల్లులను చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయమై సంగారెడ్డి జిల్లా విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ సింగ్ వివరణ కోరగా.. రెండు రోజుల్లో బిల్లులు చెల్లింపులు జరుగుతాయన్నారు.



చెరకు రైతులపై చిత్తశుద్ధి ఏది?

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి
- '6 అబద్ధాలు 66 మోసాలు' నినాదంతో నిరసన



బైక్ ర్యాలీలో గోదావరి, బీజేపీ శ్రేణులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంతంలోని చెరకు రైతుల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై 6 అబద్దాలు 66 మోసాలు' నినాదంతో సోమవారం పట్టణంలో నిరసన తెలిపారు. పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆమె స్కూటీ నడిపారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ జహీరాబాద్ చెరకు రైతుల బతుకులు ఆగం అవుతున్నా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ట్రైడెంట్ కర్మాగారంలో రెండు సంవత్సరాల నుంచి క్రషింగ్ నిలిచిపోయినా ప్రభుత్వానికి పట్టింపులేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఆందోళన చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడెందుకు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఆదుకోవాలన్నారు. ఫార్మా కంపెనీల వల్ల వాయు, జల కాలుష్యం నెలకొని ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నారింజ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాస్కర్, జగన్నాథ్, శ్రీనివాస్ గౌడ్, సుధీర్ బండారీ, పూల సంతోశ్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రషర్ ఏర్పాటు పనులు ఆపండి

నల్తూరు గ్రామస్తుల ధర్నా

జిన్నారం(పటాన్‌చెరు): క్రషర్ పనులు వెంటనే నిలిపివేయాలని మండలంలోని నల్తూరు గ్రామ రైతులు కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని నల్తూరు గ్రామంలోని సర్వే నంబర్ 160లో మూడు రోజులుగా క్రషర్ల ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా క్రషర్ యజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయ ఏఓ పరమేశ్, మైనింగ్ శాఖ అధికారులతో పాటు తహసీల్దార్ ఆఫీస్‌లో వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

అల్పపీడనంతో కురిసిన చిరుజల్లులు



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రి వాన కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల పడిన వర్షానికి పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక శాతం పత్తి పొలాల్లోనే ఉందన్నారు. చేతికి వచ్చిన పంట తడిస్తే నష్టం వస్తుందన్నారు. పత్తి తీసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలు సైతం వీచిన గాలులకు, కురిసిన వానకు ఇబ్బందికి గురయ్యారు. పొలాల్లోనే ఆవాసంగా ఏర్పాటు చేసుకొన్న డేరాలు దెబ్బతిన్నాయి.

మా ఆవేదన ఆలకించరూ..

వీఆర్‌ఏల వారసుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏ వారసులు

61 ఏళ్ల వయసు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని వీఆర్‌ఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జీవో 81, 85 ప్రకారం వీఆర్‌ఏ వారసులకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ప్రతినిధిని వినతి పత్రం అందించారు.

– సంగారెడ్డి జోన్:

విల్లు సంధించి.. టార్గెట్ ఛేదించి

విల్లు పట్టి వలయాన్ని గురి చూసి కొట్టారు.. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే చాన్స్ పట్టారు. రాష్ట్రస్థాయి వేదికపై ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ విజయాల వెనుక కృషి, పట్టుదలతో పాటు కఠోర సాధన ఎంతో ఉందని చెప్పక తప్పదు. మరోమారు జాతీయ వేదికపై సత్తా చాటేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈనెల 15 నుంచి జార్ఖండ్ రాష్ట్రంలో పోటీలు జరగనున్నాయి.

- జాతీయ స్థాయి ఆర్చరీకి క్రీడాకారుల ఎంపిక
- కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పోటీలు నిర్వహణ

పటాన్‌చెరు: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 1న నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల విజేతలను ప్రకటించారు. ఎంపికైన వారు ఈ నెల 15 నుంచి 20 వరకు జార్ఖండ్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొంటారని ఆర్చరీ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు టీఎస్ పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆదివారం 10వ రాష్ట్ర ఆర్చరీ చాంపియన్ షిప్, రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, కోశాధికారి సత్య ప్రసాద్, భీమ్ సేన్, ప్రణయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు వసంత విచ్చేసి ప్రతిభ చూపిన ఆర్చర్స్‌ను అభినందించారు. కాగా, నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన పవన్ కళ్యాణ్‌ను సన్మానించారు.



ఆర్చరీలో సత్తా చాటిన క్రీడాకారులతో పవన్ తదితరులు

విజేతలు వీరే

ఇండియన్‌రౌండ్ పురుషుల విభాగం

తెలంగాణ స్థాయి ఆర్చరీ పోటీల్లో ఇండియన్ రౌండ్ విభాగంలో మహబూబ్‌నగర్‌కు చెందిన రమావత్ రవి ప్రథమ స్థానం. ఖమ్మంకు చెందిన కాయం లక్ష్మణ్. వరంగల్ క్రీడాకారుడు సీహెచ్. చరణ్, ఖమ్మంకు చెందిన ముత్తి చరణ్ వరసగా 2, 3, 4వ స్థానాలు పొందారు.

ఇండియన్ రౌండ్ మహిళా విభాగంలో

వరంగల్‌కు చెందిన క్రీడాకారిణులు రఫీఖ్ తాసీమ్ ప్రథమ, వరంగల్ క్రీడాకారిణి బి.త్రినయిని ద్వితీయ, వి. స్రవంతి(రంగారెడ్డి జిల్లా) తృతీయ, నిజామాబాద్‌కు చెందిన భవానీ నాల్గో స్థానం.

రీకర్వ్ ఆర్చరీ పురుషుల విభాగం

గంగరాజు(వరంగల్), ఎస్. అశోక్ (రంగారెడ్డి), ఎస్. అఖిల (వరంగల్)లు వరుసగా తొలి మూడు స్థానాలు. అలాగే వరంగల్ చెందిన కె. అచ్యుత్ నాల్గవ స్థానం.

రీకర్వ్ మహిళా విభాగం

ఎస్.నాగేశ్వరీ (వరంగల్), శారద(వరంగల్), గుర్రాల వింధ్యా(రంగారెడ్డి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు. వరంగల్‌కు చెందిన క్రీడాకారిణి విజయ లక్ష్మి నాల్గవ స్థానం.

కంపౌండ్ పురుషుల విభాగం


ఖమ్మం క్రీడాకారుడు వేముల శివసాయి ప్రథమ స్థానం. ద్వితీయ, తృతీయ స్థానాల్లో హైదరాబాద్‌కు చెందిన కే.సాయి సుశాంత్, ఐనయ్యా రాజేందర్. ఆర్యన్ నాల్గవ స్థానం.

కంపౌండ్ మహిళా విభాగంలో..

టి.చికిత(కరీంనగర్), బి.మానస నయన(రంగారెడ్డి), మన్సూరా హసీబా(వరంగల్)లు వరుసగా మొదటి మూడు స్థానాలు. హైదరాబాద్‌కు చెందిన శ్రేష్ఠ రెడ్డి నాల్గవ స్థానం.

మల్లన్న జాతరకు ఏర్పాట్లు

- ముస్తాబవుతున్న ఆలయం
- ఈనెల 7 నుంచి ఉత్సవాలు



మైలార్ మల్లన్న

జహీరాబాద్: జహీరాబాద్‌కు సమీపంలోని కర్ణాటకలో గల మైలార్ మల్లన్న జాతర ఉత్సవాలు ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆ మేరకు ఆలయం ముస్తాబు అవుతోంది. భాల్కి తాలూకా ఖానాపురంలో గల ఆలయంలో మల్హరి, మలాసకాంతే, భానుల వివాహంతో జాతర ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభం అవుతాయి. 10వ తేదీ రాత్రి పల్లకీసేవ, నందిపై దేవుడి విగ్రహంతో ఊరేగింపు జరగనుంది. 14న నెమలిపై దేవుడి విగ్రహం ఊరేగింపు, 15న పల్లకీసేవ, అశ్వంపై ఉత్సవ విగ్రహ ఊరేగింపు నిర్వహించనున్నారు. 22న పల్లకీసేవ, ఏనుగుపై ఉత్సవ విగ్రహంతో ఊరేగించనున్నారు. జనవరి 3న జాతర ముగింపు కార్యక్రమం జరనుందని ఆలయ కమిటీ చైర్మన్ ప్రకాశ్, ఈఓ అనంతరావు కుల్‌కర్ణిలు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు దర్శించుకోనున్నారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యం


నీలిమ

శివ్వంపేట(నర్సాపూర్): యువతి అదృశ్యమైన ఘటన మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన విద్యార్థిని నీలిమ తూప్రాన్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. గత నెల 29న ఇంట్లో కాలేజీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి సాయంత్రం వరకు తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులు వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం యువతి తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈడ్చుకుంటూ తీసుకెళ్లి.. తలపై కొట్టి..

భర్తను చంపిన భార్య


సంపత్ మృతదేహం

మునిపల్లి(అందోల్): భర్తను ఓ భార్య దారుణంగా హత్య చేసింది. ఈ ఘటన మునిపల్లి మండలం మక్తక్యాసారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కొండాపూర్ సీఐ డీ.వెంకటేశం, బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన గుడ్ల సంపత్ (39) మక్తక్యాసారం గ్రామానికి చెందిన పోతు రాజు మంజులను వివాహం చేసుకున్నారు. దంపతులు మక్తక్యాసారంలో నివాసం ఉంటున్నారు. సంపత్ నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తున్నాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నారు. ఈ సోమవారం కూడా తాగి రావడంతో భర్తను నిలదీసింది. మాటామాట పెరిగి క్షణికావేశంలో భర్త తలపై కట్టెతో కొట్టి ఇంట్లో నుంచి ఈడ్చుకుంటూ బయట వరండాలోకి తీసుకొచ్చింది. అతనిపై గచ్చు బండపై పడడంతో తల పగిలింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాజీవ్ నాయక్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

ఏడుగురు అరెస్ట్

పటాన్‌చెరు టౌన్: పేకాట స్థావరం పై పోలీసుల దాడులు నిర్వహించిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. ఎస్‌ఐ కుర్షిత్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం జీపీఆర్ వెంచర్‌లో వాటర్ ప్లాంట్ వద్ద పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. సోమవారం రాత్రి దాడులు నిర్వహించి లక్ష్మీకాంత రెడ్డి, సాయిబాబా, శంకర్ రెడ్డి, వర ప్రసాద్ రెడ్డి, వెంకట్, లక్ష్మారెడ్డి, రవీందర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నాం. వారి వద్ద నుంచి రూ.62,440 నగదు, మూడు కార్లు, ఏడు ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అతడితో ప్రాణం భయం ఉంది

పోలీస్ అధికారిపై మహిళా రైతు ఫిర్యాదు


మాట్లాడుతున్న భాగ్య

దుబ్బాకరూరల్: తనకు ప్రాణ భయం ఉందని ఓ మహిళా రైతు పోలీస్ అధికారిపై దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. అప్పనపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు ఈరబోయిన భాగ్య వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తోంది. వీరి పొలం పక్కనే అదే గ్రామానికి చెందిన పోలీస్ అధికారి వ్యవసాయ పొలం ఉంటుంది. ఇతడు వేరొక జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవలె ఆమె పొలం మీదుగా పోలీస్ అధికారి తన పొలానికి ట్రాక్టర్ నడుపుకుంటూ తీసుకెళ్లాడు. ఇలా ఎందుకు తీసుకెళ్తున్నావని ప్రశ్నించింది. నాకు ఇష్టం వచ్చినట్లు తీసుకెళ్తానంటూ బూతులు తిడుతూ భయ బ్రాంతులకు గురి చేశాడని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ.. పోలీస్ అధికారితో ప్రాణం భయం ఉందని, అతడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ గంగరాజ్‌ను వివరణ కోరగా ఇద్దరి మధ్య పొలం గట్టు విషయంలో గొడవ జరిగిందన్నారు.బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీస్ అధికారి తండ్రి రాంరెడ్డి ఆమెపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇష్టానుసారంగా..

తండాల్లో యథేచ్ఛగా గుడుంబా తయారీ

- వ్యవసాయ క్షేత్రాల్లో బట్టీలు ఏర్పాటు
- ప్యాకెట్లు మారి.. బాటిళ్లలో విక్రయాలు
- పచ్చని సంసారాల్లో చిచ్చు
- తూతూ మంత్రంగా ఎక్సైజ్ శాఖ దాడులు


అక్కన్నపేట మండలంలోని ఓ తండాలో బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): పచ్చని పల్లెల్లో నాటుసారా ఏరులై పారుతోంది. సారాకు బానిసై జనం అటు జేబులను ఇటు ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు. మద్యం అమ్మకానికి దీటుగా గుడుంబా అమ్మకాలు సాగుతున్నాయి. అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామంతోపాటు శివారులోని సుమారు 10, 12 తండాలు, ధూల్మిట్ట మండలంలోని గిరిజన తండాలకు కేంద్ర బిందుగా ఈ నల్ల, తెల్ల బెల్లం, పటిక సరఫరా జోరందుకుంది. అదే విధంగా బొత్తెల పర్రె నుంచి నాటు సారా ద్విచక్రవాహనాలపై వందలాది లీటర్లలో కొన్ని తండాలకు సరఫరా అవుతోంది. అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేస్తుండటంతో యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారు.

అడపాదడపా దాడులు

ఏదో సమాచారం వస్తేనే ఎక్సైజ్ శాఖాధికారులు నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేస్తూ హడావిడి చేయడం ఆ తర్వాత అంతా మామూలుగానే మారిపోతోంది. గతంలో నాటుసారా తయారీ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపినా పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో మళ్లీ గుడుంబా తయారీ దారులు అదే వృత్తిలో కొనసాగుతున్నారు. ముఖ్యంగా దాస్‌తండా, రాజుతండా, చాపగానీతండా గ్రామ పరిధిలోని ఇప్పలపల్లి, తెల్లపలుగు తండా, బోదర్‌వాగు తండా, పంతుల్ తండా, బంగారులొద్ది తండా, మసిరెడ్డి తండా, కేశనాయక్ తండా, గండిపల్లి గ్రామ పరిధిలోని గిరిజన తండాలతో పాటు పల్లెల్లో నాటు సారా ఏరులై పారుతున్నా అధికారులు అడపాదడపా దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. కానీ చిత్తశుద్ధితో పని చేయడం లేదన్న విమర్శలు లేకపోలేదు. దాడులు చేయడం, బెల్లం పానకం ధ్వంసం చేయడమే తప్ప తయారీ దారుల్లో మార్పు దిశగా


ఓ వ్యవసాయ క్షేత్రంలో గుడుంబా తయారీ

ప్రయత్నం చేయడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్యాకిట్లు కాదు.. బాటిళ్లలో..

నాటుసారా గతంలో ప్యాకిట్లలో ఉత్పత్తి చేసేవారు. అయితే రవాణా కష్టంగా ఉందని తయారీదారులు రూటుమార్చి కొత్త తరహాలో వాటర్ బాటిల్లో నింపేసి గుట్టుగా తరలించేస్తున్నారు. సారాను లీటర్, అర లీటర్ బాటిళ్లలో తరలిస్తున్నారు.

ఏడాదిలో...

ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, నంగునూర్ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 2023–24 ఏడాది కాలంలో 200 లీటర్ల నాటు సారాను పట్టుకొని పారబోశారు. అదేవిధంగా 110 మందిని అరెస్ట్ చేశారు. దాదాపు 10 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 716 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. 255 కిలోల నల్ల, తెల్ల బెల్లం స్వాధీనం చేశారు. 2 ద్విచక్రవాహనాలు, ఆటోను సీజ్ చేశారు. అలాగే 116 మందిని బైండోవర్ చేయగా అందులో బైండోవర్‌ను ఉల్లంఘించిన ఆరుగురికి సుమారుగా రూ.17,500 జరిమానా విధించారు.

జైలుకు పంపుతాం



నల్ల, తెల్ల బెల్లం తోపాటు పటిక అమ్మకాలు చేసే వారిని గుర్తించి జైలుకు పంపుతాం. ప్రస్తుతం తెల్ల బెల్లం అమ్మకాలు చేసే వారిని బైండోవర్ చేశాం. ప్రతీ రోజు పల్లెలు, తండాల్లో దాడులు చేసి కేసులు పెడుతున్నాం. కొన్ని తండాల్లో జోరుగా నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంది. గుడుంబా తయారీ చేసే వారిలో మార్పు కోసం ప్రయత్నం చేస్తున్నాం.

– పవన్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, హుస్నాబాద్

బస్సు ఢీకొని విద్యార్థినులకు గాయాలు

- కళాశాలకు వెళ్లేందుకు బస్టాండ్‌లో నిలబడగా ప్రమాదం

పాపన్నపేట(మెదక్): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థినులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పాపన్నపేట మండలం నార్సింగి వద్ద సోమవారం చోటు చేసుకుంది. పాపన్నపేట పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నార్సింగి గ్రామానికి చెందిన అఖిల, విజయ పాపన్నపేట జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాలేజీకి వచ్చేందుకు నార్సింగి బస్‌స్టాప్ వద్ద తోటి విద్యార్థులతో కలిసి నిల్చున్నారు. అదే సమయంలో బొడ్మట్‌పల్లి నుంచి మెదక్ వైపు వెళ్తున్న మెదక్ డిపో ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ నర్సింలు, లెక్చరర్లు శ్రీనివాస్ ,ప్రవీణ్, ఇంటర్ డీఐఈఓ మాధవి ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. అఖిల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పాపన్నపేట ఏఎస్‌ఐ సంగన్న కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాద స్థలంలో గాయపడిన విద్యార్థినులు

విద్యార్థుల రాస్తారోకో..

ఈ ఘటనకు కారణమైన బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, కళాశాల, పాఠశాలల సమయంలో బస్సుల సంఖ్య పెంచాలని పాపన్నపేట, టేక్మాల్ మండల ఏబీవీపీ కన్వీనర్లు ప్రవీణ్, మురళీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, నగర కార్యదర్శి అనిల్ తదితరులు డిమాండ్ చేశారు. మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ వద్దకు వెళ్లగా సమయం ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పాపన్నపేటలో విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ప్రిన్సిపాల్ నర్సింలు వచ్చి విద్యార్థులను సముదాయించి, జిల్లా అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక


విద్యార్థితోపాటు గైడ్ టీచర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

- ఆకట్టుకున్న జంతువుల బారిన పొలాలను కాపాడుకునే ప్రదర్శన

నర్సాపూర్ రూరల్: రాష్ట్రస్థాయి ఇన్ స్పైయిర్ వైజ్ఞానిక ప్రదర్శనకు మండలంలోని కాగజ్ మద్దూర్ విద్యార్థి మధు ప్రదర్శన ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నాజియ తబస్సుమ్, గైడ్ టీచర్ యూసుఫ్ సోమవారం తెలిపారు. ఇటీవల మెదక్‌లో జరిగిన జిల్లా ఇన్ స్పైయిర్ వైజ్ఞానిక ప్రదర్శనలో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి మధుపంట పొలాలను జంతువుల నుంచి రైతులు కాపాడుకోవడం గురించి తయారు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనుకు గాను మొదటి బహుమతి రాగా, 8వ తరగతి విద్యార్థి సంతోష రెండవ బహుమతి గెలుచుకుంది. ఈ ప్రదర్శన ఎంపిక రావడం కోసం కృషి చేసిన గైడ్ టీచర్ యూసుఫ్‌ను రైతన్నలు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ సూర్య ప్రకాశ్ రావు, మహేందర్ రెడ్డి, సత్యనారాయణ చారి, కవిత, వెంకటేశ్వరరావు, అప్పలనాయుడు, సురేశ్ కుమార్, సుందరయ్య, బసవరాజ్, నర్సింలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలకు..

శివ్వంపేట(నర్సాపూర్) : మండల పరిధి పెద్దగొట్టిముక్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైంది. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా విద్యాశాఖ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని శ్రీవల్లి పాల్గొనగా తృతీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం సురేశ్, ఉపాధ్యాయుడు రాజు సోమవారం తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు శ్రీవల్లిని అభినందించారు.

రగ్బీలో సత్తాచాటిన మెదక్ జట్లు


మెడల్స్‌తో మెదక్ జిల్లా బాలుర జట్టు

- రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన బాలబాలికలు

చేగుంట(తూప్రాన్): రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో మెదక్ జిల్లా మూడో స్థానంలో నిలిచిందని రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గణేశ్ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ అండర్ 14 రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ఆది, సోమవారాల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా బాలికల జట్టు కరీంనగర్ జట్టుపై 15–0 స్కోర్ తేడాతో, బాలుర జట్టు 10–0 స్కోర్‌తో గెలుపొందాయన్నారు. రెండు జట్లు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ విజయాలపై ఆర్గనైజింగ్ కార్యదర్శులు రమేశ్, సౌందర్య, అమూల్యమ్మ, అబ్జర్వర్ కిష్టయ్య హర్షం వ్యక్తం చేశారు.

మానవత్వం చాటుకున్న కలెక్టర్, ఎస్పీ

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడిని ఆస్పత్రికి తరలింపు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి వద్ద బైక్ అదుపుతప్పి యువకుడు రోడ్డు ప్రమాదానికి గురి కాగా అటుగా వెళ్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ విజయ్‌కుమార్‌రెడ్డి ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. మెదక్ మండలం మక్త భూపతిపూర్ గ్రామానికి చెందిన రాజు సోమవారం చిన్నశంకరంపేటలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహించి ఇంటికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఇదే సమయంలో మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై మెదక్ తిరిగి వస్తున్న జిల్లా ఉన్నతాధికారులు యువకుడు ప్రమాదానికి గురైన విషయం గమనించారు. వెంటనే తమ కన్వాయ్‌ను నిలిపి యువకుడిని మెరుగైన వైద్యం కోసం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారి వెంట అదనపు కలెక్ట్ నగేశ్ ఉన్నారు.


యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఉన్నతాధికారులు

సదరం క్యాంపు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా

సిద్దిపేటరూరల్: జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 5న ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, డిసెంబర్ 12, 19న మానసిక, కంటి చూపు లోపం, చెవుడు, మూగ వారికి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ముందుగా దివ్యాంగులు మీ సేవా కేంద్రాల్లో వారికి సంబంధించిన వైకల్యంతో ఆన్‌లైన్ స్లాటు బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. వారికి కేటాయించిన తేదీల్లో హాజరు కావాలని సూచించారు. కోమటి చెరువు దగ్గరలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. స్లాట్ నమోదు కాని వారు హాజరుకావాల్సిన అవసరం లేదని తెలిపారు. దరఖాస్తు అనంతరం మీసేవా రసీదు, పాస్ పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్, వైకల్యంతో ఉన్న ఫొటో, వైద్యులు పరిశీలించిన రిపోర్టులు తీసుకొని రావాలని కోరారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

- శివ్వంపేట మండలం పోతులబోగూడలో ఘటన

శివ్వంపేట(నర్సాపూర్): అప్పుల బాధతో రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధి పోతులబోగూడ గ్రామానికి చెందిన మంద నాగులు(36) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. నూతన ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు అప్పు చేశాడు. అప్పులు తీర్చేందుకు ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఆదివారం సాయంత్రం బయటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం గుర్తించిన స్థానిక రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య పుష్ప, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


నాగులు (ఫైల్)

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

ముగ్గురికి గాయాలు

సిద్దిపేటరూరల్: ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నారాయణరావుపేట మండలం మల్యాల శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. 108 సిబ్బంది శ్రీహరి, వెంకటేశ్ కథనం మేరకు.. గుర్రాలగొంది గ్రామానికి చెందిన వెన్నెల, సంతోష్ సిద్దిపేట నుంచి ఇద్దరు పిల్లలు జశ్వంత్, వైష్ణవిలతో బైక్ పై ఇంటికొస్తున్నారు. మల్యాల శివారు వద్దకు రాగానే ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలుడు జశ్వంత్‌ని మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన నార్సింగి మండలం జప్తిశివనూర్ జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. సోమవారం రామాయంపేట వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. కామారెడ్డికి చెందిన దేవ బన్ని, శ్రీహరికి తీవ్ర గాయాలు కాగా రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

మునిపల్లి(అందోల్): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మహిళ మృతి చెందింది. బుదేరా పోలీసుల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా, మండలం, కొత్తగడి గ్రామానికి చెందిన టేకు అంజమ్మ (50) మనవరాలు బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతుంది సోమవారం మనవరాలిని చూడడానికి కళాశాలకు వచ్చి తిరిగి వెళ్తూ 65వ నంబర్ జాతీయ రహదారి మధ్యలో డివైడర్ దాటుతుంది. ఈ క్రమంలో జహీరాబాద్ నుంచి సదాశివపేట వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలి

బీసీ వెల్ఫేర్ స్కూల్స్ కార్యదర్శి శ్యాంప్రసాద్ లాల్

హుస్నాబాద్: విద్యార్థులు పూర్వ విద్యార్థుల చేయూతను అందిపుచ్చుకొని ఉన్నత స్థితికి ఎదగాలని తెలంగాణ బీసీ వెల్ఫేర్ స్కూల్స్ సంయుక్త కార్యదర్శి జీవీ శ్యాంప్రసాద్ లాల్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం సూపర్ ఫర్‌ఫార్మెన్స్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని ఆనాటి ఉపాధ్యాయులు ఇచ్చిన చేయూత వల్లనే ఈ స్థితికి చేరానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, కౌన్సిలర్ శ్రీనివాస్, ఎంఈఓ మనీల, హెచ్‌ఎం వాసుదేవ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో శ్యాంప్రసాద్ లాల్ తదితరులు

అభ్యాసన సామర్థ్యాల నిర్ధారణకే..

- పరక్–24 అచీవ్‌మెంట్ సర్వే
- 4న జిల్లా వ్యాప్తంగా నిర్వహణ
- మూడు, ఆరు, తొమ్మిది తరగతి విద్యార్థులకు పరీక్షలు
- 97 పాఠశాలల్లో 133 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌లు ఎంపిక


ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌లకు అవగాహన కల్పిస్తున్న పరక్–24 అసోసియేట్ జిల్లా కో ఆర్డినేటర్ భాస్కర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాల, విద్యా ప్రమాణాల నిర్ధారణకు కేంద్ర ప్రభుత్వం పరక్ 24 అచీవ్‌మెంట్ సర్వేను నిర్వహిస్తుంది. ప్రతీ నాలుగేళ్లకు ఒకసారి ఈ అచీవ్‌మెంట్ సర్వేను కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తుంది. గతంలో 2021లో నిర్వహించిన ఈ అచీవ్‌మెంట్ సర్వేలో తెలంగాణ 33వ స్థానంలో నిలిచింది. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో సిద్దిపేట జిల్లా 18వ స్థానంలో నిలిచింది.

జిల్లాలో 97 పాఠశాలల్లో నిర్వహణ

దేశ వ్యాప్తంగా డిసెంబర్ 4న ఈ అచీవ్‌మెంట్ సర్వేను నిర్వహిస్తుంది. పరక్ అనగా పర్ఫామెన్స్ అసెస్మెంట్ రివ్యూ అనాలసిస్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్మెంట్. ఈ అచీవ్‌మెంట్ సర్వేను జిల్లాలో 97 పాఠశాలల్లో నిర్వహించనున్నారు. అందుకు గాను 133 మంది బీఈడీ (బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్) విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌లుగా ఎంపిక చేశారు. ఈ ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌లు ఎంపిక చేసిన పాఠశాలలో మూడు, ఆరు, తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అచీవ్‌మెంట్ సర్వేను నిర్వహించనున్నారు. ఈ సర్వేలో భాగంగా ఆయా పాఠశాలల్లో 30 మంది విద్యార్థులను శాంపిల్‌గా తీసుకొని, వారికి అసెస్మెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. మూడో తరగతి విద్యార్థులకు 45 మార్కుల పేపర్‌కు గాను 90 నిమిషాల సమయం, ఆరవ తరగతి విద్యార్థులకు 51 మార్కులకు 90 నిమిషాలు, 9వ తరగతి విద్యార్థులకు 60 మార్కుల పేపర్ 120 నిమిషాల వ్యవధి ఇవ్వనున్నారు. ప్రతీ పాఠశాలకు ఎస్సీఈఆర్టీ నుంచి ఒక సెంట్రల్ అబ్జర్వర్, ఒక ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ వెళ్తారు. వీరు పాఠశాల అసెంబ్లీ సమయం కన్నా ముందే చేరుకొని నిర్ణయించిన సమయానికి (అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష నిర్వహిస్తారు. దీంతో పాటుగా పిల్లల, ఉపాధ్యాయుల, ప్రధానోపాధ్యాయుల ప్రశ్నావళి ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల ద్వారా సమాచారాన్ని సేకరించనున్నారు.

పాఠశాలల విద్యా ప్రమాణాలు..

ఈ సర్వే ద్వారా విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు ఏ స్థాయిలో ఉంటున్నాయి, పాఠశాలల విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయి అనేది తెలియనుంది. దేశ వ్యాప్తంగా చూస్తే రాష్ట్రంలోని విద్యా ప్రమాణాల గురించి, రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే జిల్లాలోని విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో ఈ సర్వే ద్వారా తెలుస్తాయి. ఇప్పటికే పలు పాఠశాలల్లో ముందస్తుగా విద్యార్థులకు సర్వే పై అవగాహన కల్పించారు. అదే విధంగా ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌ల (బీఈడీ విద్యార్థులు)కు, పరక్ 24 పై ముందస్తు శిక్షణ ఇచ్చారు.

అభ్యాసన సామర్థ్యాలు తెలుస్తాయి



కేంద్ర ప్రభుత్వం ప్రతీ నాలుగేళ్ల కోసారి ఈ అచీవ్‌మెంట్ సర్వేను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తుంది. ఈసారి డిసెంబర్ 4న ఈ అచీవ్‌మెంట్ సర్వేను దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఈ సర్వే ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ సర్వేలో భాగంగా నిర్ణయించబడిన పాఠశాలలోని 3, 6, 9వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ప్రశ్నావళి ద్వారా సమాధానాలు రాబడుతారు. దీంతో పాఠశాల విద్యా ప్రమాణాలు తెలుస్తాయి. విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

– భేతి భాస్కర్, పరక్ 24 అసోసియేట్ జిల్లా కో ఆర్డినేటర్